
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# అమ్మ పుట్టిల్లు

చంద్రలత



"ఇక ఈ ఊరితో మన పేగుముడి తెగినట్లే" మామయ్య ఫోనులో ఉద్వేగంగా అన్నాడు." బహుశా ఇదే అక్కయ్య పెట్టే ఆఖరి సంతకం!

నాకు ఎలా స్పందించాలో తెలియలేదు.

మామయ్య మాటల ఉద్వేగం నన్ను ముంచెత్తింది. తెప్పరిల్లి నెమ్మదిగా అడిగాను, "ఎప్పుడు రమ్మంటావు మామయ్యా...?"

"సెలవు లేకుండా చూసుకొని రా. మళ్లీ రిజిస్ట్రార్ ఆఫీస్ మూసేయగలరు"

"సరే.. . మామయ్యా.. . ఆఫీసులో పనులవీ చూసుకొని" డెడ్‌లైన్ల మధ్య వేళ్లాడే సాఫ్ట్‌వేర్ మనిషిని నేను. నా సమయం నా చేతుల్లో వుంటే కదా? అందుకే ఈ సణుగుడు.

"ఎలాగైనా తెముల్చుకోరా చిన్నూ" మామయ్య గొంతులో జీర.

మామయ్య పిలుపు నా పసితనాన్ని ఒక్కసారిగా తట్టి లేపింది. ధీరగంభీరుడైన మామయ్య కంఠంలోని ఆ తడి నా గుండెను తడిమింది. మరుక్షణంలో మరోటి ఆలోచించకుండా మాట ఇచ్చేశాను.

"తప్పకుండా మామయ్య" భరోసా ఇచ్చేశాను.

"ఎప్పుడు వచ్చేది రాత్రికి ఫోన్ చేసి చెప్తాగా"

మామయ్య చిన్నపిల్లాడిలా సంబరపడ్డాడు.

కానీ, అమ్మను ఎలా తీసుకెళ్లడం? ఆలోచించాలి.

ఓ నిట్టూర్పుతో మళ్లీ లోకంలో పడ్డాను, నాలోకంలోకి.

Happy Homes are always Built with Housing Loans from SBH
0.50% Less on Interest Rates
50% Discount on Processing Fee
Avail Oct' 31 '06
For further details contact our nearest branch
Helpline : 1800-4254055. website : www.sbhyd.com
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
65 years of dedicated service.

*Conditions Apply

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

నాలోకమంతా మూడు చదరాలు. కంప్యూటర్, ఆఫీసు, ఇల్లు. చేతికి మట్టి అంటని ఉద్యోగం. నాకు మట్టి మనుషుల గురించిన ఆలోచనలు ఎలా సాగుతాయి? ఎందుకు సాగవు?

చిన్నప్పుడు తాతయ్యగారి చెట్టు మీద ఆడిన కోతికొమ్మచ్చులు నేను ఎలా మరిచిపోగలను? కొబ్బరి చెట్ల కింద ఉత్తుత్తి కుస్తీలు పట్టడం, పోటీలు పడి కబడ్డీ ఆడడం, తురాయి చెట్టుకు పట్టిన తేనెతుట్టెకు ఓ పిల్లాడి చేతి రాయి తగలడం.. జుమ్మంటూ తేనెటీగలు అందరిని తరిమి తరిమి కొట్టడం.. పిక్కలు పట్టేసేలా ఉరుకులు పరుగులతో ఎగశ్వాస దిగశ్వాసలతో వాగొడ్డున జమ్మి చెట్టు మొదట్లో కూలబడడం.

అమ్మమ్మ వండి వడ్డించిన అప్పచ్చులు, తాతయ్య కట్టించిన ఊయలలు, మోటబావిలో ఈతలు, మామయ్య చేతిలో వీపు విమానం మోతలు, అప్రయత్నంగా నా పెదవులపై చిరునవ్వు కదలాడింది.

ఊహ ఎంత అందమైంది!

ఊహలో ఎంత ఆనందముందీ!

ఎంత అందమైనదీ, ఎంత ఆనందమైనదీ అంటే ఊహించలేనంత! నా పెదవులపై కదిలిన చిరునవ్వు మనసంతా హుషారు నింపేసింది. కొద్దిసేపటిలోనే నాకు తెలియకుండానే జ్ఞాపకాల వెల్లువలో తడిసి ముద్దవుతున్నాను.

''థ్యాంక్ యూ.. మామయ్యా...'' ఎక్కడో వున్న మామయ్యకు ఓ ముద్దు విసిరేసాను చిన్నపిల్లాడిలా. గాలిలో తేలుతూ మామయ్యను చేరకపోతుందా అని!

★★★

నేనేమయినా పరాయి దేశంలో ఉన్నానా? పాస్‌పోర్టు వీసాల అడ్డంకులున్నాయా? తలచుకుంటే ఎంతసేపు ప్రయాణం? ఇలా వెళ్లి అలా వచ్చేయొచ్చు.

ఏమో... అయినా మామయ్యగారింటికి వెళ్లి ఎన్నాళ్ళయిందో! ఎన్నేళ్లయిందో! బహుశా ఏడో తరగతి చేరినప్పటి నుంచి సెలవులకి అమ్మమ్మగారి ఊరెళ్లడం మానేశాం.

''వచ్చే ఏడాది ఏడో తరగతి, వేసవికాలం ఊళ్లమ్మట తిరుగుతూ వృథా చేస్తార్రా ఏం? అంటూ ఓ సమ్మర్ క్యాంప్‌లో ఇరికించేశారు. ''చెట్లమ్మట, పుట్లమ్మట తిరుగుతూ ఎందుకూ పనికిరాకుండా పోతాడు... సుమతీ, నా మాట విను. వాడి భవిష్యత్తు ముఖ్యం''

అమ్మకు బాగా తెలుసు. నాన్న ఎంత అనునయంగా చెప్పినా అదే ఆజ్ఞ అది అమలు చేయవలసిందేనని!

ఇక అటు నుంచి రాకపోకలే కానీ ఇటు నుంచి ప్రయాణాలు తగ్గిపోయాయి. అమ్మ మనసులో ఏముందో తెలియదు. ఎప్పుడూ ఆ దిశగా ఆలోచించలేదు. ఆమె ఎప్పుడూ నా సమయాన్ని నాన్న ఇచ్చిన కొలబద్దతో కొలుస్తూ నాకొక ప్రణాళికాబద్ధమైన సెక్రటరీగా వ్యవహరించసాగింది. నాన్న నా ప్రతిభను ఓ పక్క నా భవిష్యత్తును మరో పక్క తూకం వేస్తూ వుండేవాడు.

అప్పుడప్పుడు మామయ్య వచ్చి వెళ్లేవాడు. అమ్మ పుట్టింటి కబుర్లు అటూ ఇటూ మోస్తూ వెన్నుంద్రాళ్లు, గోరుచిక్కుళ్లు, చిట్టిచేమంతులు, గోరింటాకులతో సహా.. .

తాతయ్య కాలం చేసినప్పుడు నా పదోతరగతి పరీక్షలు. అమ్మమ్మ కదిలిపోయినప్పుడు నా ఎంసెట్. పాపం... అమ్మకు కూడా పట్టుమని పదిరోజులు పుట్టింట్లో వుండే అవకాశమే రాలేదు. ఆపై తనదీ, చెల్లెలి విదేశాల చదువులు, ఉద్యోగాలు, వివాహాలు.

ఇంతలో, చెల్లి పురుళ్లు పుణ్యాలు...అమ్మ ప్రవాస జీవితం. నాన్న ఒంటరి జీవనం...ఇదిగో మనలేని మనుగడపై విసుగెత్తి, మళ్లీ తను స్వదేశానికి తిరిగి వచ్చాక అప్పుడు ఉద్వేగంతో అనుకున్నా.. .''ఏరి తల్లీ మన చుట్ట పక్కాలు'' అని

హైదరాబాద్‌లో వున్నామన్న మాటేకానీ, పని ఊబిలో కూరుకుపోయి వున్నాం. నేను, విశాలి.

ఇప్పుడు నాన్న లేరు. అమ్మకు తీరిక లేదు.

అటు చెల్లెలి పిల్లలు, ఇటు మా పిల్లలకు ఆమె పెద్దదిక్కు.

అటు మెంఫిస్‌కూ ఇటు హైదరాబాద్‌కు మధ్య తిరుగాడుతూ వుంది.

ఈ వెసులు లేని బతుకుల్లో ఇంకా స్థిరత్వం వచ్చినట్లే లేదు.

అనుకోవడమే కానీ అయిన వారింట వెళ్లి గడిపే తీరిక ఇంకా దొరకలేదు. మామయ్యే వచ్చి ఓ మారు పలుకరించి వెళ్లాడు. ఆ మాటకొస్తే మామయ్య పిల్లలిద్దరూ వుండేది అమెరికాలోనే. మేమందరం నిత్యం పలకరించుకుంటూనే వుంటాం. పరామర్శించుకుంటూనే వున్నాం. మెయిల్ గ్రూప్‌లో. ఎటొచ్చి మేమందరం ఒకరినొకరు కలసి...తనివి తీరా గడిపి ఎన్నాళ్లయిందో! ఎన్నేళ్లయిందో!

ఆ కాలువగట్లూ...కుస్తీపట్లు...సీతాకోకచిలుకలు...హూ!

''అమ్మను అక్కడ ఓ పదిరోజులు ఉండమని అందామా?'' విశాలితో అన్నాను.

''ఓ మై గుడ్‌నెస్! నాడెడ్‌లైన్స్! ఓ సెమినార్ ఆర్గనైజ్ చేయాల్సి వుంది. నేను పేపర్ ప్రజెంట్ చేయాలి. గ్రూప్ లీడర్‌ని కదా. ఇప్పుడు...నేను సెలవు పెట్టాలంటే...?'' విశాలి గొణిగింది. చింటూ సిరీస్, మింటూ గాడి రివ్యూ. పై నుంచి వాళ్లిద్దరివీ కల్చరల్స్ ఏవో వున్నాయట''

అవును.

విశాలి చెప్పింది నిజమే.

ఒక్క క్షణం అటూ ఇటూ తప్పినా తమ జీవనం తల్లకిందులై పోతుంది. పెద్దలకీ...పిల్లలకీ...అందరికీ అమ్మే పెద్దదిక్కు.


సాధారణంగా అమ్మ తమ దగ్గర వుండేటప్పుడు తనూ విశాలి ఎక్కువ అసైన్‌మెంట్స్, కొత్త ప్రాజెక్టులు తీసుకొంటారు. అమ్మ పిల్లలను ఇంటిని చూసుకుంటుంది. అమ్మ చెల్లెలి దగ్గరకు వెళ్లిన ఆరు నెలలూ ఇద్దరిలో ఎవరో ఒకరం పిల్లల బాధ్యత తీసుకోవాలి. అక్కడ చెల్లి, ఆమె భర్త అంతే!

ఎవరో చేసిన ఒడంబడికలో నిశ్శబ్దంగా ప్రణాళికాబద్ధంగా రోజులు గడుస్తున్నాయి. దానాదీనా, అమ్మ ఎప్పుడూ ఆన్ డిమాండ్!

''అత్తయ్య మనల్ని నలుగుర్ని పిల్లలు నలుగుర్ని పెంచుతున్నారు'' విశాలి అంటుంది అప్పుడప్పుడూ...'' పిల్లల చదువులు, మన ఉద్యోగాలు అత్తయ్యపైనే ఆధారపడి వున్నాయి. మనం మర్చిపోకూడదు!

అలాగని అంతా సవ్యంగా వుందని చెప్పలేం.

''ఎంతయినా అత్తయ్యకు కూతురిపై ఆమె పిల్లలపై మమకారం ఎక్కువ'' అని విశాలి లోలోన అన్నా



"ఎంత కాదనుకున్నా అమ్మకు చిన్నప్పటి నుంచి నేనంటే చులకనే. అన్నయ్య పక్షపాతి. ఎన్ని చెప్పినా అన్నయ్య పిల్లలేగా ఆమెకు అసలు వారసులు!'' చెల్లెలు బిగ్గరగానే అంటుంది. అనుకున్న సమయానికి అమ్మ రాకపోకలు కాస్త అటూ ఇటూ అయితే చాలు!

ఎప్పుడు ఎవరు ఎలా ఆలోచిస్తుంటారో...ఏం చేస్తుంటారో ఎవరు చెప్పగలం?

సరే ఇప్పుడు అమ్మకి మామయ్య చెప్పిన విషయం చెపితే ఎలా స్పందిస్తుందో? తనకీ ఇంత ఉద్వేగంగా వుంటే...ఇక అమ్మ ఉరకలు వేయదూ?

వీలుంటే పిల్లలనూ తీసుకెళితే బావుండేది.

వీలుపడదు. విశాలి చెప్పింది కదా. వాళ్లవి తమ కన్నా బిజీ షెడ్యూల్స్. తమకైనా సెలవు పెట్టడానికి సాకు దొరుకుతుందేమో కానీ వారికి దొరకదు!

విశాలి అన్నీ చూసుకుంటుందన్న ధీమా. ఇక సర్దేశా. నా సరంజామా. అన్నీ పనులూ ఆమెకే అప్పజెప్పి... మూడు రోజుల సెలవుతో ఊరికి బయలుదేరాం నేనూ, అమ్మ.

అదే చిత్రం

అమ్మ ఏమీ అనలేదు.

మాట్లాడలేదు. ఓ ఉలుకూ పలుకూ లేదు.

అలాగే బయలుదేరాం. ఊరికి

ప్రయాణంలోనూ అమ్మ అంతే. కళ్లు మూసుకొని కిటికీకి తలవాల్చి పడుకుంది. నేను వ్యాక్‌మన్ హెడ్‌ఫోన్స్ తలకు తగిలించి...కారు ముందుకు ఉరికించాను.

★★★

పొలం గట్టు మీద నిలబడ్డాం. మామయ్య, నేను.

కళకళలాడుతూ ఆముదాల పంట. కంకులు బారెడు పొడవున్నాయి. చెట్లు మనిషికి మించిపోయాయి.

మామయ్య మాతో మాట్లాడుతూనే పొలంకి నడచి వెళ్లాడు. వెనకే నేనూ వెళ్లాను. నడుస్తూ నడుస్తూ మామయ్య విరగకాసిన ఓ చెట్టును కాలితోనే మొదలంటా విరిచేశాడు.

"మామయ్య.. . అంతటి చక్కటి చెట్టును అలా విరిచేశావే?'' అసంకల్పితంగా వంగి చెట్టును మళ్లీ నిలబెట్టే ప్రయత్నం చేస్తూ.

"బెరుకుచెట్టు!'' మామయ్య అభావంగా అన్నాడు. "ఏడేళ్లుగా కరువు. ఈ ఏడు ఎడతెరిపి లేకుండా వాన''

పచ్చగా కళకళలాడుతోన్న పొలాలు. నిండుగా తళతళలాడుతున్న చెరువులు, దొరువులు. ఎంతో ఆహ్లాదకరంగా వుంటే మామయ్య అలా నిరాశగా అంటాడేం?

అదే అడిగాను.

"ఆ పచ్చదనం పంట ఎదుగుదల చూసి మురిసిపోవద్దురా. పైరు తండు బోయింది.'' ఈ ఏడాది పంట పోయింది. ప్రతి ఏటి కన్నా దారుణంగా!''

"ఓ...! మరి పొలం కొనేవాళ్లు ఏం చేస్తారు?''

"కాలువలు వస్తున్నాయి. మన పొలాల పక్కనే పెద్దకాలువ పారుతుంది ఇక నీటికి కొదవ వుండబోదు''

"అలాంటప్పుడు పొలాల్ని వదులుకోవడం ఎందుకు మామయ్య?''

"సేద్యం ఆషామాషీ వ్యవహారం కాదురా చిన్నా...కంటి పాపలా పెంచాలి పంటను'' మామయ్య కంఠంలో ఒక విధమైన నిర్లిప్తత

"మరి ఆ పై నువ్వు ఏం చేస్తావ్...మామయ్య...? ''

ఎందుకో ఈ ప్రశ్న నా గొంతులోంచి సులువుగా బయటపడలేదు. అడగలేక అడిగాను.

మామయ్య అంతే.. . మాట మాట్లాడకుండా గుంభనంగా నవ్వాడు.

చెరువు గట్టు మీదుగా ఇంటికి వచ్చాం. చెరువు నిండా జమ్మి, తూటుపూలు, వాడుకకు పనికొచ్చేలా లేవు నీళ్లు. ఏదో దుర్గంధం కంపు. పొలాల ఎరువుల మిగులు తగులు చెరువుపై తెట్టులా తేలుతోంది.

"కొత్త నీరు పెట్టినా...అంతే'' మామయ్య నా మనసులో మాట తెలిసినట్లు అన్నాడు.

"అందుకే కాస్త దూరంగా మరో చెరువు తవ్వించాలి. కాలువలు వచ్చేలోగా'' మళ్లీ మామయ్య గొంతులో ఓ ఉత్సాహం.

ఇంటి ముందుకు వచ్చేసరికి వాకిట్లోనే కనపడింది. అమ్మ అరుగు మీద.

"నువ్వు మాతో పాటు వస్తే పోయేదమ్మా'' నేను వెళ్లి అమ్మ పక్కన కూర్చున్నా.

"అందరినీ పలుకరించావా అక్కయ్యా'' మామయ్య మంచం వాలుస్తూ అన్నాడు.

"ఎవరున్నార్రా తమ్ముడూ వెనుక వీధిలో రత్నమ్మ అమెరికా పోయింది. కూతురు పురుడు పోయను. పక్కవీధిలో పురుషోత్తం గారి భార్య పట్నం పోయింది. మనవళ్లకు పరీక్షలట. చదివించడానికి. మరొకరు ఆసుపత్రికి. ఇంకొకరు కూతురిని కాపురానికి పంపను బోయారు. అసలు ఊరే కళ తప్పింది. పై నుంచి ఏదో వత్తిడి కనిపిస్తోంది. మునుపటిలా లేదు'' అమ్మ మౌనంగా వుంది కాసేపు.

మామయ్య మాట్లాడడం మొదలుపెట్టాడు. "అక్కయ్యా నువ్వు శేషమ్మ మనవడిని, సుందరం బాబాయిని పలకరించిరాలా? వాగొడ్డు లక్ష్మమ్మ కొడుకునీ...? ఒకప్పుడు పట్నం పోవాలంటే పోయారా? ఇప్పుడు మళ్లీ పొలాలు మగతాకు తీసుకొని మరీ సేద్యం చేస్తున్నారు.

"అదేంట్రా అందరూ పట్నం పోతుంటే వీళ్లేంటి...'' అమ్మ అడిగింది.

"వీళ్ల పోకడ రాకడ అయింది''

"మన ఊరివాళ్లంతా ఉలిపి కట్టెల్లే అక్కయ్యా.. .'' మామయ్య నవ్వాడు. "ఏముందీ వాళ్ల పిల్లల చదువులు అయిపోయాయి. ఉద్యోగాలు కుదిరాయి. పెళ్లిళ్లు పురుళ్లు పుణ్యాలు అయ్యాయి. అయినా అప్పట్లో పట్నం కాపురాలు చేయగలిగారంటే ఇక్కడ పంటలుపండితేనేగా? ఇప్పుడు పంటలు లేవు. పట్నం కాపురాలే చేసేట్టు లేవు. మళ్లీ వెనక్కు వచ్చేశారు'' అంతే కాదు ఇప్పుడు పట్టణమే పల్లెలోకి వలస వచ్చింది. ఫ్రిజ్‌లు, టీవిలు, సోఫాలు ఏం లేవు చెప్పు''

"అన్నీ బాగానే వున్నాయి కానీరా తమ్ముడూ.. . ఆ సొంబడితో ఏదో పేచీలో పడ్డావంట.'' అమ్మ కళ్లు చికిలించింది. ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండానే మొదటిసారిగా వ్యవహర్తలా మాట్లాడింది.

"అదంతా అయిపోయిందిలే''

"అందుకేనా పొలం అమ్మకానికి పెట్టింది?'' అమ్మ ఆరా తీసింది. అంతకు ముందు ఎప్పుడూ అంత తీవ్రంగా అనలేదు.

"మాటా మాటా పెరిగింది. నువ్వెంతంటే నువ్వెంత అని'' మామయ్య గుమ్మడికాయ దొంగలా అన్నాడు.

"ఏముందీ చెప్పడానికి?''

"ఏమీ ఎందుకుండదురా? నాకు ఈ పుట్టింటితో మిగిలిన ఏకైక బంధం ఆ మడిచెక్క. దానికోసం ఇంత రాద్ధాంతమా?'' అమ్మ గొంతులో దిగులు.



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

''అవునక్కా... అడిగాడు... శాయన్న. ఆ పొలం కావాలన్నాడు. దానికేంలే ఇవ్వచ్చు. కాలువలు వస్తున్నాయిగా. రేటు పెరిగింది. ఎవరికో ఎందుకు తనే తీసుకుంటాను అన్నాడు సాంబడు. ఈపొలం కనుక శాయన్న తీసుకుంటే బండి బాటకు వాళ్లను బతిమలాడాలి. వాళ్లని అడిగేదేంటి? పొలమే నాకిమ్మంటాడు సాంబడు. ఇదీ విషయం''

అమ్మలో మునుపెరుగని నివ్వెరపాటు. మామయ్య ముఖంలోకి చూస్తూ వుంది.

''మొన్నామధ్య కాలువగట్టు దగ్గర తగాదా.. . అటు మొన్న మురుగు కాలువ తీయబోతే తగాదా... ఒకటా రెండా? ఆముదాల చేలో అడ్డంగా బండిని నడిపేశారు. రోజూ గొర్రెలు కొట్టుకుపోతున్నారు. మొక్కల తొక్కిడి. ఆగడం. అడిగేవారే లేకుండా పోయారు! అంతెందుకు నిన్నటికి నిన్న నిలువెత్తు చెట్టును రాత్రికి రాత్రి నరికించేశారు. అదేంట్రా అంటే మొదలు మన చేలో వున్న మాను వాళ్ల పక్కకి పెరగిందట! అబ్బబ్బ!'' మామయ్య ఉస్సూరుమన్నాడు.

కనిపించకుండా తడిగుడ్డతో గొంతులు కోసే కనికట్టు కార్పొరేట్ మనుషులం మేము. మామయ్య చెపుతున్నది చాలా చిత్రంగా అనిపించాయి. సూదిమొన మోపినంత నేల కోసం...'' యుద్ధాలు చేసుకున్నారంటే ఇలాంటి పౌరుషాలతోనే నేమో...

''అయినా ఈ తగదాలన్నీ మనకు సాంబడి మధ్య కదా! ఈ శాయన్న ఎందుకు లాగార్రా?'' అమ్మ స్పష్టంగానే అడిగింది.

''మన తరపున నిలబడింది శాయన్నేగా...'' మామయ్య మాట మింగేశాడు. ''తమాషాగా మొదలయింది. తాతల దాకా పోయింది. నువ్వెంతంటే నువ్వెంతని మీ తాత బర్రెలు కాసాడంటే మీ తాత గొర్రెలు మేపాడనీ... ఒక అంతూ దరీ లేదు. ఇది నా పుట్టినూరు అంటే నా పురటిగడ్డనీ తలలు పగిలాయి. పోలీసుల కేసులు. కాకుండా ఎట్లాగో ఆపి వుంచాం.'' మామయ్య పూర్తి చేశాడు.

''ఇంత జరిగినా నాతో మాట మాత్రం అనలేదురా?'' అమ్మ గొంతులో అపనమ్మకం.

నిజమేమరి. అది అమ్మ పొలం.

''జరిగిందేదో జరిగిపోయింది. వదిలేయ్ అక్కా. బయానా తీసుకొన్నా రిజిస్టర్ చేయాలి మరి''

''మన కాళ్లు మట్టిలో వుండొచ్చు కానీ, భావాలు బురదలో వుండకూడదురా. మొదట శాయన్నకు మాటిచ్చావు. వాళ్ల డబ్బు కూడబెట్టుకునేలోగా మరొకరికి ఇచ్చావు. ఇదెక్కడి వ్యవహారంరా?'' అమ్మ గొంతు ఖంగుమంది.

''ఇది మాట మీద నిలబడేరోజులు కావులే అమ్మా, నోటు మీద నిలబడే రోజులు. అయినా మన కెందుకమ్మా ఆ పొలం పుట్రా. ఆ తగవులు తలనొప్పులూ? నేనేమయినా తిరిగి వస్తానా? చింటూ, మింటూ వస్తారా? ఆ వచ్చే నాలుగు డబ్బుల్లో సిటీలో ఏదైనా కొంటే... అది పెరిగే విలువ కానీ తరిగేది కాదు. ఎవరికి అమ్మితేమనకెందుకు? మామయ్య అన్నీ చూసి పెట్టారు. నువ్వు సంతకం పెట్టేయ్'' నేను నా అభిప్రాయం స్పష్టంగా చెప్పాను.

''ఏమని పెట్టాలి?'' అమ్మ తీవ్రంగా స్పందించింది.

''ఏమీ అనకుండానే పెట్టు'' నేను వాతావరణం తేలిక పరుద్దామని నవ్వుతూ అన్నాను.

''అది మా అమ్మ చేనురా. మా అమ్మమ్మ తన పసుపు కుంకుమల చేనును అమ్మి అమ్మకు కొనిచ్చిన చేనురా. తరతరాల జ్ఞాపకాలున్నాయి. అక్కడ పండిన పంటలో చేసిన పరమాన్నంతోనే నాకు అన్నప్రాశన చేశారు. ఆ మడిచెక్కతోనే నేను అత్తవారింట అడుగుపెట్టాను. మా అమ్మ అక్కడ నాటిన మామిడి చెట్టు మొదట్లోనే విశ్రమించి వుంది. శుభమైనా, అశుభమైనా, కరువైనా, ఉరువైనా, ఏడాదికొక్కమారు 'అక్కా నేనున్నానని' నా తమ్ముడు పలకరించింది ఆ పంటతోనేరా'' అమ్మ ఉద్వేగంగా అన్నది.

''అమ్మా... అవన్నీ ఎవరూ కాదన్నారు? ఇది ఎమోషన్స్‌తోనో నోస్టాల్జియాతోనో తీసుకోవాల్సిన నిర్ణయం కాదు. మనకు ఈ ఊరితో ఏమిటి సంబంధం? మనపాటికి మనం పోతాం. మామయ్య కొన్నాళ్లకి వాళ్ల పిల్లల దగ్గరికి వెళతాడేమో. మిగిలేది. ఆ సాంబయ్య మామయ్య, ఈ శాయన్న కొడుకులేగా? వాళ్లను ఎలా డీల్ చేయాలో మనకేం తెలుసు? అమ్మా అన్నీ మామయ్యకు వదిలేయ్! తనే చూసుకొంటాడు.'' చాలాసౌమ్యంగా స్పష్టంగా చెప్పేశాను. నేను నా అభిప్రాయాన్ని.

''ఎవరికి అమ్మాలో నేను ఆలోచించుకుంటాను'' అమ్మ భీష్మించింది.

''ఏంటక్కా... వయసు వస్తోన్న కొద్దీ మొండితనం పెరుగుతోందే... ఇదే బావయ్య వుంటే ఇంత వరకూ రానిచ్చేవాడా?'' మామయ్య అసహనంగా అన్నాడు.

''అందుకేగా నేను ఆలోచించడం మొదలుపెట్టాను. మంచేమిటో చెడేమిటో''

''మంచి చెడుల తర్కవితర్కాలు ఇప్పుడెందుకు కానీ... అమ్మా నాన్న వుంటే ఏం చేసేవాడో ఉన్ననాళ్లు ఏం చేశాడో అదే చేద్దాం. మామయ్యా... నీ ఇష్టప్రకారం కానీ! '' నేను భరోసా ఇచ్చేశాను. అమ్మ అలాగే అంటుందిలే తేలికగా తీసిపారేశాను.

అమ్మ దవడ బిగుసుకుంది. గిర్రున తిరిగి గదిలోకి వెళ్లింది.

★★★

అమ్మ కన్నా కోపంగా మామయ్య బయటకు వెళ్లిపోయాడు.

అటూ ఇటూ తేల్చుకోలేక నేను!

మా తాతయ్య మొత్తానికి మంచి చిక్కునే తెచ్చిపెట్టాడు. ఆ ఇచ్చేదేదో నాన్న పేరున రాసేస్తే పోయేదిగా. ఎప్పుడో వదిలించి పారేసేవాడు. అయినా అమ్మేమిటి అంత మొండి పట్టు? ఆమెకు ఉన్న ఏకైక సన్నిహిత బంధం మామయ్యేగా. లేనిపోని మంకుపట్టి ఆ ఒక్కడిని దూరం చేసుకోదుగా?

ఎవరికి అమ్మితే ఏం పోయింది? అనవసరంగా గొడవ తెచ్చి నెత్తిన పెడుతోంది.

మామయ్య పిల్లలతో సంబంధాలు తెగిపోవు? అటు చెల్లికి ఇటూ తనకు వారెంత అండగా వుంటున్నారో... అంతా ఈ సిల్లీ విషయంలో కొట్టుకు పోయేటట్టుగా వుంది

ఏదో కొంత డబ్బు వస్తుంది. కొత్త ఫ్లాట్ ఇన్‌స్టాల్‌మెంటుకి ఉపయోగపడుతుంది. అనుకున్నా...కానీ ఇక్కడంతా తలకిందుల



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

వ్యవహారంలా తయారయింది. కోరి తెచ్చుకుంటున్న తలనొప్పి...ప్చ్

"మా అమ్మా ఇంతే"

మామయ్య ఎప్పుడు తిరిగి వచ్చాడో కానీ, నా పక్కన చతికిల పడుతూ అన్నాడు. "అసలా పొలం అక్క పేరున పెట్టే దాకా ఎంత పట్టు పట్టిందని? ఘనంగా వుంటుంది. అబ్బాయి పేరున పెడదాం" అని నాన్న అంటే ఆమె వింటేనా? అక్క అన్నట్లే జరిగితే, నేను మళ్లీ ఊళ్లో తలెత్తుకుతిరగ్గలనా? ఈ ఆడాళ్లకు ఏం తెలుసు? పరువు, మర్యాద? ఆరెండూ మంట కలిశాక నేనిక ఈ ఊళ్లో ఉన్నట్లే. ఎంత అణచుకుందామని అనుకున్నా మామయ్య ప్రతి మాటలో అసహనం.

"మామయ్య...అదేం జరగదులే! ఓపూట గడవనీ...అమ్మ తనే సర్దుకుంటుంది. మనం ఎక్కువా? ఆమె మాట ఎక్కువా? తేల్చుకోనీ!" అమ్మకు వినిపించాలని కాస్త బిగ్గరగానే అన్నాను. లోపలి గదిలోకి ప్రతిధ్వనించేలా.

ఆశ్చర్యం...అమ్మ అప్పుడే ఇంటి గేటు తీసుకొని లోపలకి వస్తోంది. అమ్మ ఎప్పుడు? ఎక్కడికి వెళ్లింది?

మామయ్య నేనూ ముఖముఖాలు చూసుకొన్నాం.

అమ్మ ఎలాంటి ఉపోద్ఘాతాలు లేకుండా మామయ్యతో సూటిగా అంది.

"పొలం రిజిస్ట్రేషన్ ఎల్లుండి. నువ్వు మొదట బయానా తీసుకున్న రేటుకే... వారికే!"

"ఎవరికీ ఆ శాయన్న కొడుక్కా? తాతముత్తాతల పొలం వాళ్ల చేతుల్లోకా?" మామయ్య అసహనం హద్దులు మీరుతోంది. నన్ను ముంచెత్తబోతోంది.

"కొంపదీసి వాళ్లకు చెప్పి వచ్చావా అమ్మా?" అనుమానంగా అడిగాను.

"అవును"

"అది మన తరతరాల వారసత్వం. దిక్కుదివాణం లేని వాడి చేతుల్లో పెడతామా? మన చేలో వాళ్ల కాడి నడుస్తుందా?" మామయ్య చివాలున లేచినిల్చున్నాడు.


"ట్రాక్టర్ నడుస్తుంది!" అమ్మ నింపాదిగా అంది.

"ఇది నా జన్మభూమి. పురిటిగడ్డ. నేను పరాయి పాల్జేయనివ్వను. వాళ్లెవరికో ఎందుకు? నాకే రిజిస్టర్ చేయి! తరువాతి సంగతి తరువాత!!" మామయ్య స్థిరనిశ్చయంతో అన్నాడు.

"వాళ్లకి మొదట మాట ఇచ్చింది నువ్వే!" అమ్మ నిమ్మలంగా అంది.

"తొందరపడ్డాను. తెలుసుకున్నాను. ఎవరికీ వద్దు. నాకే రాసేయ్!" మామయ్యా ఉద్వేగంగా అన్నాడు. "అమ్మ చెట్టు ఉందక్కడ! అది నా పేగు ముడి!

"నీ జన్మభూమి... నీ పురిటి గడ్డ...నీ పేగు ముడి! బావుందిరా తమ్ముడూ...! మరి నాకు? అమ్మకు? అమ్మమ్మకు?" అమ్మ తీవ్రంగా అంది. "పుట్టినప్పటినుంచి మావి కావు అనుకుంటూనే పెరిగాం. ఈ చెట్టును, పుట్టను, గట్టును, కాలువగట్టును పిచ్చుకగూళ్లనూ, ప్రేమించడానికి పెంపకం అడ్డురాలేదురా. ఆ ఆపేక్షలు ఆ ఆప్యాయతలే మేం కూడపెట్టుకున్న ఆస్తులురా. అంపకాలుపెట్టి సాగనంపిన చోటికి వెళ్లాం. ఎక్కడిక్కడ ఆప్యాయతలు, అనురాగాలుకొరకు పరితపించడం తప్ప అధికారాలు పెంచుకోలేకపోయాం. బావుంది. జననీ జన్మభూమి అంటూ మీరు తలలు పగలుకొట్టుకుంటున్నారే అసలు జనని జన్మభూమి ఏదిరా? ఇది కాదు కదరా?" అమ్మ మాటలు ఓ వెల్లువలా ముంచెత్తుతున్నాయి.




నేను, మామయ్య నిశ్చేష్టులమై నిలబడిపోయాం.

"ఎక్కడో పుట్టి ఇక్కడ మట్టిలో కలిసిన అమ్మ పుట్టిల్లు, పేగుముడి, జన్మభూమి, మనం ఏనాడైనా గుర్తుచేసుకున్నామా? అసలీ జన్మభూమి అన్న దాంట్లోకి డొల్లతనం తెలుస్తుందా? ఆ భూమి ఎవరు జన్మించింది? అక్కడి మగవారు! చూశావా...ఈ ఆలోచనలో ఎంతటి సంకుచిత్వం వున్నదో! అంతగా ఎందుకూ యాభై ఏళ్లు నీతో కాపురం చేసిన నీ భార్య ఈ భూమిపై మమకారం పెంచుకోలేదా? ఆమె జన్మభూమి ఇది కాదే? అంత మాత్రాన ఆమె ఈ భూమికి పరాయిదవుతుందా?" అమ్మ గొంతు రుద్ధమయింది. "మీకు తెలియదురా? ఆపేక్ష అంటే.. ఆతృత అంటే..

మేము ఏమీ మాట్లాడలేని మాటలే లేని నిస్సహాయులమయ్యాం.

నిశ్శబ్దంగా ఒకరి వైపు మరొకరం చూసుకొని అమ్మ వైపు చూశాం.

"మాకేమీ కాదని తెలిసి మేమెలా ప్రేమించగలమో మీరు అర్థం చేసుకోలేరురా. అది మీతప్పు కాదు. పుట్టినప్పటి నుంచీ గిట్టేదాకావున్న వూరిపై ఓ పట్టు బిగించి గిరి గీసుకుని కూర్చున్నారు. ఆ గిరిని వదిలి బతకలేమోనన్న భయంలోనే ముడుచుకుపోతున్నారు. కాలం మారిందేమో కానీ, కథ అంతే!" అమ్మ కాస్తాగి మళ్లీ అంది, "ఎక్కడైనా బతకగల ధైర్యం... ఎచ్చోటనైనా మమకారాన్ని పెంచుకోగల గుండె...మాకున్నాయిరా" అమ్మ మాట్లాడడం లేదు. ఆమె భావ ప్రసంగంలో ముచెత్తుతోంది. నేనూ మామయ్య నోట మాట రాని వాళ్లమై నిలబడిపోయాం.

"నా పొలాన్ని ఎవరు ఆపేక్షగా, బిడ్డలా చూడగలరో వాళ్లకి ఇస్తాను. మీ మాట పోనివ్వడం దేనికని సాంబడినే ముందు అడిగాను...బండి దారి గురించే మాట్లాడాడు ఎంతసేపు. "మన మధ్యలో ఆ గాసగాడి కొడుక్కి పొలమేంటి" అంటూ భీరాలు పోయాడు. ఎంత అహం.. ఎంత భేషజం...సాంబడి ప్రతి మాటలో!

శాయన్న బుద్ధెరిగినప్పటి నుంచి ఆ పొలం ఆనుపానులు ఎరిగిన వాడు. బిడ్డలా సాగకలడు. అమ్మను ఆప్యాయంగా పలకరించగలడు. నాకు ఆ నమ్మకం వుంది. వాడు మీ లాంటి వాడే. ఏ ఆపేక్షతో ఆ చెట్టు కోసం... ఆ గట్టుకోసం మీ తరఫున తన తల పగలగొట్టించుకొన్నాడో... ఆ ఆపేక్షతోనే ఆ చేనుని చూసుకుంటాడు! ఇక అతని కొడుకుని నాలుగు అక్షరాలు నేర్పే బడి మొదలు పెట్టమన్నాను. చదువు అబ్బితే చాలు అన్నీ అమరుతాయి. వాళ్లిచ్చే డబ్బు వాళ్లకే ఉపయోగపడుతుంది. ఇకపై పొలం వాళ్లది. ఇకనైనా వాళ్లను బ్రతకనీయండిరా"

అమ్మ వెళ్లి కారులో కూర్చుంది.

మరో మాట మాట్లాడకుండా...

నేనూ మామయ్య నిలువపాతరేసినట్లు నిలబడిపోయాం.

మరో మాట మాట్లాడలే....